## మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్




డీఎంహెచ్‌వోగా బాధ్యతలు స్వీకరిస్తున్న డా.హరీశ్‌రాజ్

మంచిర్యాల అర్బన్, ఆగస్టు 1 : మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డా.హరీశ్‌రాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం మంచిర్యాల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా బదిలీ చేసిన విషయం విదితమే. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న డా.అనిత ఎప్పటిలాగే జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా డా.హరీశ్ రాజ్‌కు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.అనిత, కార్యాలయ సూపరింటెండెంట్ విశ్వేశ్వర రెడ్డి, డెమో బుక్క వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## 61 మంది బాలకార్మికులకు పునరావాసం

- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- ఆపరేషన్ ముస్కాన్ ముగింపు కార్యక్రమం



మాట్లాడుతున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 1 : ఆపరేషన్ ముస్కాన్ -10 ద్వారా 61 మంది బాల కార్మికులను గుర్తించి పునరావాసం కల్పించామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఆపరేషన్ ముష్కాన్-10 ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముష్కాన్ -10 కార్యక్రమం ద్వారా తప్పిపోయిన పిల్లలతో పాటు బాలకార్మికులు, అక్రమ రవాణాకు గురవుతున్న చిన్నారులను గుర్తించి, వారికి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్ టీమ్ సిబ్బంది పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ మహేశ్, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, డీసీఆర్‌డీ సీఐ రమేశ్, అడ్మిన్ ఆర్ఐ పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి : కాంటా చౌరస్తా వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ శ్రేణులు



చెన్నూర్ : పోలీసు స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు



చెన్నూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# బీఆర్ఎస్ ఆగ్రహజ్వాల

**రేవంత్ డౌన్ డౌన్**

- అసెంబ్లీ సాక్షిగా సీనియర్ మహిళా ఎమ్మెల్యేలను అవమానించిన రేవంత్
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా మిన్నంటిన బీఆర్ఎస్ నిరసనలు
- అనుచిత వ్యాఖ్యలపై రేవంత్ దిష్టిబొమ్మ దహనాలు, ధర్నాలు, రాస్తారోకోలు
- భేషరతుగా క్షమాపణలు చెప్పాలని మహిళల ఆందోళనలు

మంచిర్యాల రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు





మంచిర్యాలలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

మంచిర్యాల, ఆగస్టు 1(నమస్తే తెలంగాణ) : 'తెలంగాణ అసెంబ్లీ సాక్షిగా ఆడబిడ్డలను అవమానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బీఆర్ఎస్ సీనియర్ మహిళా శాసనసభ్యులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై అనుచితమైన వ్యాఖ్యలు చేశారు.' ఈ అవమానాన్ని సహించేది లేదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసనలు తెలిపారు. సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ మహిళా నాయకులపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సబితాఇంద్రారెడ్డిని విమర్శించే స్థాయి రేవంత్‌రెడ్డికి లేదంటూ మండిపడ్డారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ నాయకుల ఎదురుదాడిని తట్టుకునే సత్తా లేకే ఆడబిడ్డలపై అనవసర ఆరోపణలు చేస్తూ సభను తప్పుతోవ పట్టించేందుకు ఎత్తుగడలు వేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అసమర్థ పాలనను జనం ఛీ కొట్టే రోజులు ఎంతో దూరంలో లేవని, ఇప్పటికైనా తీరు మార్చుకోవాలంటూ హెచ్చరించారు. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసనలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. బెల్లంపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పాల్గొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. మిగిలిన నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు.

### ముందస్తు అరెస్టులు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గ వ్యాప్తంగా నిరసనకు సిద్ధమైన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కొన్నిచోట్ల ముందస్తు అరెస్టులు చేయగా, మరి కొన్నిచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలు దహనం చేసి నిరసన తెలుపుతున్న నాయకులను అదుపులోకి తీసుకున్నారు. చెన్నూర్‌లో నిరసనకు సిద్ధమైన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి రాజారమేశ్, చెన్నూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. నిరసన చేయకుండా పోలీసులు టౌన్‌లోని ప్రధాన సెంటర్లలో నిఘా పెట్టడంతో బీఆర్ఎస్ నాయకులు రాజీవ్ రహదారిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌ను తీసుకెళ్లారు. కోటపల్లి మండల కేంద్రంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేయకుండా బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. దీంతో మిగిలిన కార్యకర్తలు పారుపల్లి గ్రామంలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలోని ధర్నా చౌక్‌లో పోలీసులు బందోబస్తు పెట్టారు. దీంతో సాయంత్రం వరకు నిరసన తెలిపేందుకు ఎదురు చూసిన బీఆర్ఎస్ నాయకులు చివరకు పోలీసుల ముందే దిష్టి బొమ్మ తీసి దహనం చేసే ప్రయత్నం చేశారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసనలో భాగంగా దిష్టిబొమ్మను దహనం చేసేందుకు పోలీసులు అవకాశం ఇవ్వలేదు. దీంతో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణలోనే కార్యక్రమాన్ని నిర్వహించారు.



మందమర్రిలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



జైనూర్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో ..

## సింగరేణి దవాఖానను మూసేస్తే ఊరుకోం

- బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- సింగరేణి ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి, ఆగస్టు 1 : బెల్లంపల్లి సింగరేణి ఏరియా దవాఖానను మూసివేస్తే ఊరుకునేది లేదని, ఆ యత్నాన్ని ఉప సంహరించుకోవాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా దవాఖాన పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఒక రోజు నిరాహరదీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. దవాఖానను పూర్తిగా మూసివేసేందుకు సింగరేణి యాజమాన్యం కుట్రలు పన్నుతోందన్నారు. 20రోజుల నుంచి ఫార్మసీ స్టోర్, పురుషుల, మహిళా వార్డులను మూసివేశారని తెలిపారు. క్యాజువాల్టీ వార్డులో నామమాత్రంగా చికిత్స అందిస్తున్నారని, ఇక్కడికి వచ్చే రోగులను రామకృష్ణాపూర్, గోదావరిఖని సింగరేణి ఏరియా దవాఖానలకు రెఫర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సరైన వైద్యులు, సిబ్బంది, నర్సులు, పారిశుధ్య కార్మికులు, ఆయాలు లేక కేవలం ఇద్దరు సిస్టర్లతో దవాఖానను కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సింగరేణి దవాఖాన పరిరక్షణ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్
- వేమనపల్లి మండలంలో సుడిగాలి పర్యటన



వేమనపల్లి పాఠశాలలో విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్‌కుమార్ దీపక్

వేమనపల్లి, ఆగస్టు 1 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం వేమనపల్లి మండలంలో ఆయన సుడిగాలి పర్యటన చేశారు. వేమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యుడు రాజేశ్, సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కలెక్టర్‌కు గ్రామస్తులు సమస్యలు విన్నవించుకున్నారు. డాక్టర్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని, సరైన వైద్యం అందడం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు తెలిపారు. డాక్టర్, వైద్య సిబ్బంది లేకపోతే ఫొటోలు తీసి తనకు పంపాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో ఎక్కడని సిబ్బందిని అడుగగా రాలేదని, బదిలీపై వెళ్లాడని కలెక్టర్‌కు సిబ్బంది సూచించారు. కలెక్టర్ వెంటనే డీపీవోతో మాట్లాడి అధికారిని నియమించాలని ఆదేశించారు. అనంతరం కార్యాలయంలోని ఈజీఎస్ కార్యాలయాన్ని సందర్శించారు. వన మహోత్సవం లక్ష్యాన్ని పూర్తి చేశారా అని ఏపీవో సత్యప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. 80 వేల మొక్కలు నాటడం లక్ష్యంగా, 90 శాతం పూర్తి చేసినట్లు ఏపీవో కలెక్టర్‌కు తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ధరణి రిజిస్ట్రేషన్‌లు ఎలా ఉన్నాయని ఆపరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. ఎందుకు నిర్మాణం పూర్తి చేయలేదని కార్యదర్శిని ప్రశ్నించారు. బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపివేసినట్లు కార్యదర్శి కలెక్టర్‌కు విన్నవించారు. మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించిందని, వీధి దీపాలు లేవని కలెక్టర్‌కు గ్రామస్తులు విన్నవించారు. ఈ విషయమై కలెక్టర్ కార్యదర్శిని ప్రశ్నించగా, గ్రామ పంచాయతీ ఖాతాలో నిధులు లేవని ఆయన తెలిపారు. అనంతరం వేమనపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. నాణ్యమైన భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రెడ్డికి సూచించారు. అనంతరం నీల్వాయిలోని ఉన్నత పాఠశాలను సందర్శించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఏపీవో పంచాయతీ కార్యదర్శి శ్యామ్, ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ మధుకర్ , టీఏ రాంమ్మోహన్, సిబ్బంది ఉన్నారు.

### విద్యార్థిని సన్మానించిన కలెక్టర్

నస్పూర్,ఆగస్టు 1: జాతీయ స్థాయి ఇన్‌స్పైర్‌లో ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచి జపాన్ ఇంటర్నేషనల్ సైన్స్ కార్యక్రమానికి ఎంపికైన జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యాసింగన్‌ను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ ఘనంగా సన్మానించారు. విద్యార్థులు వినూత్న ఆవిష్కరణలతో గొప్ప శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. డీఈవో యాదయ్య, జిల్లా సైన్స్ అధికారి మధుబాబు పాల్గొన్నారు.

## ప్రారంభమైన వెరిఫికేషన్

**436 మంది విద్యార్థుల హాజరు**



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన విద్యార్థులు

ఎదులాపురం, ఆగస్టు 1 : డీఈఈ సెట్‌లో అర్హత సాధించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా విద్యార్థులు 2024-26 విద్యా సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో చేరేందుకు ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. గురువారం ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియను ఏర్పాటు చేయగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ర్యాంకుల ఆధారంగా పత్రాలను పరిశీలించి అభ్యర్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. ఈ ప్రక్రియ ఆరు రోజుల పాటు కొనసాగుతుందని, అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. రోజు 550 మంది అభ్యర్థుల సర్టిఫికెట్స్‌ను వెరిఫికేషన్ చేస్తామని పేర్కొన్నారు. వెరిఫికేషన్‌కు వచ్చేవారు తమ ఒరిజినల్ హాల్‌టికెట్స్, డీ సెట్ అప్లికేషన్ ఫాం, ర్యాంకు కార్డు, పదో తరగతి, ఇంటర్మీడియెట్ మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని సూచించారు. పూర్తి సమాచారం కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. మొదటి రోజు 550 మందికి 436 మంది హాజరు కాగా.. 114 మంది రాలేదు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ భోజన్న పాల్గొన్నారు.